క్లుప్తంగా

వైభవంగా చండీయాగం



ఆలయం వద్ద హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

హిందూపురం: శరన్నవరాత్రుల్లో భాగంగా ఆదివారం వీడిరోడ్డులోని ఆలయంలో జగదాంబదేవి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆలయం వద్ద జగదాంబదేవి విగ్రహాన్ని ప్రతిష్టించి చండీయాగాన్ని నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి మహా మంగళహారతి చేసి భక్తులకు అన్నదానంచేశారు.

లేపాక్షిలో పర్యాటకుల సందడి



దేవాలయం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

లేపాక్షి: శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. దుర్గాదేవి, వీరభద్రస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయంలో శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించడానికి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో గణపతి నిమజ్జనం



హిందూ మహా గణపతిని ఊరేగిస్తున్న దృశ్యం

పావగడ: పట్టణంలోని మధుగిరి ఊరు వాకిలి వద్ద ఉన్న అశ్వర్థ వృక్షం కట్ట మీద ప్రతిష్టించిన హిందూ మహా గణపతి నిమజ్జనం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక బజరంగ దళ, శ్రీరామసేన సంస్థల ఆధ్వర్యంలో శోభాయాత్ర సాగింది. కణివె లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక బావిలో నిమజ్జనం చేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న టౌన్ సీఐ నగేష్

మడకశిర: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఆదివారం నేరస్తులు, రౌడీషీటర్లకు టౌన్ సీఐ నగేష్ కౌన్సిలింగ్ ఇచ్చారు. నేరాలకు దూరంగా ఉండాలని, లేకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆటల్లేవ్.. ఆడుకోవడాల్లేవ్ !

చిన్న వయస్సు నుంచే విద్యార్థులు క్రీడలు నేర్చుకోవాలి. క్రీడలతో దేహదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసంతో కలుగుతుంది. ఆటలతో పాటు క్రీడల్లోనూ రాణించాలి' అని ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులు కూడా నిత్యం ఊదరగొడుతూనే ఉంటారు. మాటల వరకూ బాగానే ఉన్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి దానికి భిన్నంగా ఉంది. అసలు చాలా పాఠశాలల్లో మైదానాలు లేక విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు.

- మైదానాలు లేక ముందుకు సాగని క్రీడలు
- విద్యార్థులకు మానసిక ప్రశాంతత దూరం
- పుస్తకాలతోనే కుస్తీపడుతున్న విద్యార్థులు



పెనుకొండలోని ఉర్దూ ఉన్నత పాఠశాల



గుట్టతో నిండి ఉన్న పాఠశాల ఆవరణ

పెనుకొండ: నియోజకవర్గంలో ప్రస్తుతం పలు స్కూళ్లలో క్రీడా మైదానాలు కరువయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లోనూ క్రీడా మైదానాలు లేకపోవడంతో ప్రాథమిక దశలోనే విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. పెద్ద బ్యాగుల్లో మోయలేనన్ని పుస్తకాలతో ఉదయం నుంచి సాయంత్రం దాకా కుస్తీ పడుతున్నారు. విద్యార్థులకు కనీస మానసిక ప్రశాంతత లేని దుస్థితులు నెలకొన్నాయి.

క్రీడలను మర్చిపోతున్న విద్యార్థులు

పెనుకొండ పట్టణంలోని ఉర్దూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడలు ఆడే భాగ్యం లేదు. కొంత స్థలంలో కోర్టు వేసుకుని అందులో ఫుట్‌బాల్ ఆడే అవకాశాన్ని ఉపాధ్యాయులు అతి కష్టంగా ఏర్పాటు చేశారు. పాఠశాలకు ఏకంగా 5 ఎకరాల స్థలం ఉన్న అది గుట్ట ప్రాంతం కావడంతో దాన్ని చదును చేయించడంపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారించలేదు. దీంతో ఆ ప్రాంతం ముళ్లకంపలు, ఇతర వ్యర్థలతో నిండిపోయింది. ఉర్దూ పాఠశాలలో 200 మంది విద్యార్థులు చదువుతున్నా వారికి క్రీడల గురించి పెద్దగా తెలియదు. ఇక.. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సైతం ఇదే దుస్థితి నెలకొంది. క్రీడలు ఆడించేందుకు స్థలం లేకపోవడంతో విద్యార్థులు క్రీడలను మరచిపోయారు. పీఈటీలు ఉన్నా కొద్ది స్థలంలోనే అరకొరగా ఖోఖో , వాలీబాల్ లాంటి ఆటలతో సరిపెడుతున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం ఒక్కటే కాస్తో కూస్తో క్రీడాకారులకు అనుకూలంగా ఉన్నా.. దానికి ఆనుకున్న విశాలమైన స్థలం ముళ్ల కంపలతో నిండిపోయి విషసర్పాలకు నిలయంగా మారింది. ఈ స్థలంలో కనీసం ముళ్ల కంపలను తొలగించడానికి అధికారులు చొరవ చూపడం లేదు.

మైదానాలు లేని పాఠశాలలు ఇలా..

- పెనుకొండ మండలంలో ఉర్దూ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, రాంపురం ఉన్నత పాఠశాల
- సోమందేపల్లి మండలంలో చల్లాపల్లి ఉన్నత పాఠశాల, మేకలపల్లి ఉన్నత పాఠశాల
- రొద్దం మండలంలో రొద్దం, చోళేమర్రి, తురకలాపట్నం, కోగిర, నారనాగేపల్లి, రొద్దం ఎంజేపీ, దొడగట్ట ఉన్నత పాఠశాలలు
- గోరంట్ల మండలంలో గోరంట్ల బాలికల ఉన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాల, మందలపల్లి, మల్లాపల్లి, పాలసముద్రం, కస్తూర్బా పాఠశాల
- పరిగి మండలంలో పి.నరసాపురం, శాసనకోట గ్రామాల్లోని ఉన్నత పాఠశాల

విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక కోట

ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారులకు ప్రత్యేక కోటా ఉంది. ప్రాధాన్యత చూపిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు, విద్యకు సంబంధించిన సీట్లలో అవకాశాలు లభిస్తున్నాయి. అలాగే జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లోనూ రాణించి దేశానికి పేరు ప్రఖ్యాతులు సాధించే అవకాశం నేటి యువతకు, బాలలకు ఉంది. అయితే క్రీడా మైదానాలు లేకపోవడం, ఇతర అసౌకర్యాలతో క్రీడలంటే స్కూళ్లలో తెలియని దుస్థితి నెలకొంది.

క్రీడా స్థలాలు ఏర్పాటు చేయాలి



ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో క్రీడా స్థలాలు ఏర్పాటు చేయాలి. బాల్యంలోనే క్రీడలంటే విద్యార్థులకు ఏమీ తెలియకపోతే ఇక రాష్ట్రాలకు, దేశానికి విద్యార్థులు ఏం పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తారు. విద్యార్థుల్లో దేహదారుఢ్యం, మేధస్సు ఎలా అభివృద్ధి చెందుతాయి? ఇప్పటికైనా క్రీడా మైదానాలపై ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి విద్యార్థులను క్రీడలకు దగ్గర చేసేలా చర్యలు చేపట్టాలి. ప్రతి పాఠశాలకు క్రీడా స్థలం ఉండేలా చూడాలి.

– ఎంఎస్ మూర్తి, పెనుకొండ

మైదానం కొరతగా ఉంది



పాఠశాలకు ఐదు ఎకరాల వరకు స్థలం ఉన్నా అది పూర్తిగా గుట్ట ప్రాంతం కావడంతో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. పాఠశాల ముందు ఉన్న కొన్ని రాళ్లను తొలగించి వాలీబాల్ కోర్టు వేశాము. ఇతర క్రీడలు ఆడించడానికి మాత్రం అవకాశం లేదు. గుట్ట ప్రాంతాన్ని కొంత వరకు మట్టితో చదును చేయిస్తే క్రీడల్లో విద్యార్థులను తీర్చిదిద్దడానికి అవకాశం ఉంటుంది.

– కృష్ణవేణి, పీఈటీ, ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాల, పెనుకొండ

డిజిటల్ బుక్‌తో కార్యకర్తలకు భరోసా



మడకశిర: డిజిటల్ బుక్ స్కానర్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: డిజిటల్ బుక్‌తో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు భరోసా లభిస్తుందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. ఆయన ఆదివారం పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో పార్టీ డిజిటల్ బుక్ స్కానర్‌ని పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆదుకోవడానికే పార్టీ అధినేత వైఎస్ జగన్ డిజిటల్ బుక్ తీసుకొచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో పడుతున్న ఇబ్బందులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కూటమి నాయకులు చేస్తున్న దౌర్జన్యాలను డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలనిసూచించారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, కేవలం వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను టార్గెట్ చేస్తూ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ఎవరినీ కూడా వదలబోమని, చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, కుంచిటి వక్కలిగ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, జిల్లా బీసీ విభాగం కార్యదర్శులు శ్రీరాములు, సత్యనారాయణయాదవ్, వైస్ ఎంపీపీ శ్రీరామరెడ్డి, మాజీ డైరెక్టర్ నాగరాజు, నియోజకవర్గ యువజన, బూత్ కమిటీ అధ్యక్షుడు శేషాద్రి, మల్లికార్జున, ఎస్సీ విభాగం నియోజకవర్గ కార్యదర్శులు మంజునాథ్, గోపి, ధను, శివానంద్, నాయకులు రఘునందన్, హనుమంతప్ప, రంగనాథ్, దేవరాజు, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'అన్నను దూషించినా పవన్‌కల్యాణ్‌కు పట్టదా?'

మడకశిర: అసెంబ్లీలో మెగాస్టార్ చిరంజీవిని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ దూషించినా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు పట్టాదా? అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైఎస్ రవిశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. అన్నకు అవమానం జరిగినా తమ్ముడిగా పవన్‌కల్యాణ్ స్పందించకపోవడం బాధాకరమన్నారు. అసెంబ్లీలో ఇష్టమొచ్చిన రీతిలో మాట్లాడటంతో నిజంగానే బాలకృష్ణకు మెంటల్ అని రాష్ట్ర ప్రజలకు అర్థమైందన్నారు. వెంటనే బాలకృష్ణ బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

చిలమత్తూరు: మండల పరిధిలోని మొరంపల్లిలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఆదివారం ఉదయం లారీ ఢీ కొట్టింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. అప్రమత్తమైన గ్రామస్తులు అటుగా వాహనాలు వెళ్లకుండా విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ తాగిన మైకంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టినట్టుగా గ్రామస్తులు తెలిపారు.

నేడు వానవోలులో 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ'

గోరంట్ల: మండల పరిధిలోని వానవోలులో సోమవారం ఉదయం ఆరుగంటలకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ వెంకటేశు, టౌన్ కన్వీనర్ మేదర శంకర సంయుక్త ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ హాజరవుతారన్నారు. పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు.

టెండర్లలో అవకతవకలు

- మున్సిపాలిటీ నిధులు రూ.32 లక్షలు నొక్కేసేందుకు ప్లాన్
- నేడు జరిగే కౌన్సిల్‌మీట్‌లో ఆమోదానికి ఎత్తుగడ

చిలమత్తూరు: మున్సిపాలిటీ సొమ్ము నొక్కేసేందుకు టీడీపీ నేతలు, అధికారులు కొత్త పంథా ఎంచుకుంటూనే ఉన్నారు. మున్సిపాలిటీ నూతన భవనం నిర్మాణానికి రూ.18 కోట్లు మంజూరు అయ్యాయని , అందుకోసం డీపీఆర్‌ను ప్రభుత్వం కోరింది. దీంతో మున్సిపల్ శాఖ అధికారులు డీపీఆర్ (డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) కోసం టెండర్లు పిలిచారు. అయితే ఈ- ప్రొక్యూర్‌మెంట్ ద్వారా పిలవాల్సిన టెండర్లు ఆఫ్‌లైన్ టెండర్లకే పరిమితం చేశారు. విజయవాడకు చెందిన ఓ కన్సల్టెన్సీకి కట్టబెట్టేందుకు సిద్ధం అయ్యారు.

2.79 శాతానికి పెంపు

మున్సిపాలిటీ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేయనుండగా డీపీఆర్ కోసం మొత్తం వ్యయంలో ఒక శాతంలోపు మాత్రమే ఖర్చు చేసేలా ఈ ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలవాల్సి ఉంది. అయితే డీపీఆర్ వ్యయాన్ని 2.79 శాతానికి పెంచి ఎవరికీ అనుమానం రాకుండా ఆఫ్‌లైన్ ద్వారా టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. నిబంధనల ప్రకారం భవనం నిర్మాణం వ్యయంలో ఒక శాతం అంటే రూ.18 లక్షలు మాత్రమే ఉండాలి. దాన్ని 2.79 శాతం రూ.50.22 లక్షలకు పెంచేశారు. రూ.32 లక్షలు మున్సిపాలిటీ నిధులను నొక్కేసేందుకు ప్లాన్ వేశారు. ఇది కౌన్సిల్ ఆమోదం పొందితే మున్సిపాలిటీ నిధులు రూ.32 లక్షలు పరులపాలు కావడం ఖాయంగా కనిపిస్తోంది. ఆన్‌లైన్ ద్వారా టెండర్లు పిలిచి ఉంటే కేవలం రూ. 3 లక్షల నుంచి రూ.4 లక్షల్లోనే డీపీఆర్ తయారు చేసేందుకు కంపెనీలు పోటీపడేవి.

నేడు కౌన్సిల్ మీట్

మున్సిపల్ నూతన భవన నిర్మాణానికి తయారు చేయాల్సిన డీపీఆర్ టెండర్ ఖరారు కాగా, దాన్ని సోమవారం జరగనున్న కౌన్సిల్ మీట్‌కు తీసుకురానున్నారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఈ అంశంతో పాటుగా వివిధ అంశాలపై ప్రశ్నించేందుకు సిద్ధమయ్యారు.

గుర్రం జాషువా, భగత్‌సింగ్‌కు నివాళి



చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మడకశిర: పట్టణంలోని 4వ వార్డు ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం గుర్రం జాషువా, భగత్ సింగ్ జయంతి వేడుకలను యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వారి చిత్ర పటాలకు యూటీఎఫ్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, యూటీఎఫ్ నాయకులు జోగప్ప, మాలింగప్ప, మూడ్ల గిరియప్ప తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: సాహితీ, సామాజిక మార్పుకు ఎంతో పాటు పడిన మహాకవి గుర్రం జాషువా సేవలు మరువలేనివని బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు న్యాయవాది శివరామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఆదివారం నాయకులు గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు నాగరాజు, రవి, ఆంద్రూస్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంతి వేడుకలను ఆదివారం పీడీఎస్‌యూ, సీపీఐ, ఏఐవైఎఫ్, ఏఐటీయూసీ నాయకుల ఆధ్వర్యంలో వేర్వేరుగా పట్టణంలోని ఎంజీఎం పాఠశాల వద్ద నిర్వహించారు. భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'కూటమి' మోసాలను వివరిద్దాం



గుడిబండ : మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



రొళ్ల: రచ్చబండలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి



అగళి: రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రొళ్ల: కూటమి ప్రభుత్వ మోసాలను పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లి వైఎస్సార్‌సీపీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గం పరిశీలకురాలు చౌళూరు మధుమతిరెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని పది పంచాయతీ కేంద్రాల్లో ఆయా పంచాయతీ పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ ' కార్యక్రమంలో భాగంగా 'రచ్చబండ' కార్యక్రమాలను నిర్వహించారు. మల్లినమడుగు రచ్చబండ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నరసింహారెడ్డితో కలిసి చౌళూరు మధుమతి రెడ్డి మాట్లాడారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఆచరణకు సాధ్యం కాని హామీలిచ్చి అమలు చేయకుండా మోసగించిందని విమర్శించారు. ప్రతిసారి ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కాని హామీలను ప్రజలకు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసగించడం చంద్రబాబుకు పరిపాటిగా మారిందని విమర్శించారు. ప్రజలకు అన్ని విధాలుగా సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందాలంటే మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాల్సిందేనన్నారు. పంచాయతీ స్థాయిలో ఏర్పాటు చేయనున్న కమిటీల్లో అందరికీ సముచిత న్యాయం చేయండానికి పార్టీ చర్యలు తీసుకుంటుందన్నారు.

అగళి: 'రాష్ట్రంలో అవినీతి, అరాచక పాలన సాగుతోంది. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయకుండా గాలికి వదిలేసింది' అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ విమర్శించారు. ఆదివారం మండల పరిధిలోని 13 పంచాయతీల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీలో భాగంగా రచ్చబండ -2 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వైఫల్యాలు ఇంటింటికీ తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు ముద్దరాజు, రామకృష్ణప్ప, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ జయకుమార్, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు జయరామప్ప, నాయకులు బసవరాజు, శివప్ప, ఈరన్న, లక్ష్మీనారసప్ప, హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: వైఎస్సార్‌సీపీ గ్రామస్థాయిలో మరింత బలోపేతమయ్యేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పంచాయతీ కమిటీ అధ్యక్షులు సూచించారు. ఆదివారం ఏఆర్ రొప్పం, గౌడనహళ్లి, చందకచెర్లు, వైబీహళ్లి, సీ కొడిగేపల్లి, కల్లుమర్రి, మణూరు, మెళవాయి, కదిరేపల్లి, బుళ్లసముద్రం, హరేసముద్రం, ఆర్ అనంతపురం, ఛత్రం, గోవిందాపురం పంచాయతీల్లో రచ్చబండ-2 కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలు, వివిధ పథకాల్లో జరుగుతున్న అవినీతి తదితర వాటిపై చర్చించి తీర్మానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, ఎంపీపీ కవిత, మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ జయపద్మ, మాజీ ఉపాధ్యక్షుడు తిమ్మారెడ్డి, సర్పంచులు గీత, పుట్టమ్మ, రామలింగమ్మ, నర్సేగౌడ్, కరియన్న, అంజినమ్మ, చెన్నయ్య, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలోని వలస, తమ్మడేపల్లి, అమరాపురం, మద్దనకుంట, ఆలదపల్లి, హలుకూరు, కె.శివరం, హేమావతి, నిడ్రగట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా పంచాయతీ కన్వీనర్లు ఆధ్వర్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు. సోషియల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులను పెడితే వారికి అండగా నిలవాలని నిర్ణయించినట్లు వైఎస్సార్‌సీపీ పంచాయతీ కన్వీనర్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కన్వీనర్లు నాగేంద్రప్ప, రవి, అశోక్, నాగేంద్రప్ప, రవికుమార్, సదానందగౌడ, జోగింద్ర, రవీంద్ర, మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, సర్పంచులు హితేంద్ర, సదానందగౌడ, గోవిందరాయ, గిరిజమ్మ, ఎంపీటీసీలు నారాయణ, హనుమంతరాయ, కెంచప్ప, తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: మండల వ్యాప్తంగా ఉన్న ప్రతి పంచాయతీలో ఆదివారం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుడిబండ పరిధిలో నిర్వహించిన 'రచ్చబండ'లో ఈరలక్కప్ప మాట్లాడుతూ చంద్రబాబు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ప్రజలతో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు



హిందూపురం టూటౌన్ సీఐ కరీంకు ఫిర్యాదు చేస్తున్న మధుమతిరెడ్డి తదితరులు

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపికపై టీడీపీ తెలుగు మహిళలు చేసిన అసభ్యకర వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు హిందూపురం టూటౌన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుమతిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ మహిళా నాయకురాళ్లు పరిమళ, శ్రీదేవి, విజయలక్ష్మి, అరుణ, చెన్నమ్మ, నాగమణి, రామాంజినమ్మలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మధుమతిరెడ్డి మాట్లాడుతూ తప్పును తప్పు అని చెబితే వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అన్న గౌరవం లేకుండా అసభ్యకరంగా మాట్లాడతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణ మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై అసభ్యకరంగా మాట్లాడితే ఆయనను అభిమానించే వారు ఎవరైనా స్పందిస్తారని, సమన్వయకర్త దీపిక కూడా అలాగే స్పందించారన్నారు. ఆమె ఎక్కడా కూడా అసభ్యంగా మాట్లాడలేదన్నారు. తప్పు చేసిన ఎమ్మెల్యే బాలకృష్ణ తీరును ఖండించాల్సిన ఆ పార్టీ నేతలు తమ పార్టీ నాయకులను లక్ష్యంగా చేసుకొని మహిళా నేతలమని చెప్పుకునే వారితో మాట్లాడించడం తగదన్నారు. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగమణిపై ఈ తెలుగు మహిళలు ఫిర్యాదు చేస్తే వెంటనే కేసు నమోదు చేశారని, ఇప్పుడు సమన్వయకర్త దీపికను బెదిరించిన విషయంలో వారిపైనా కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు కవితా రెడ్డి, సర్పంచ్ లలితమ్మ, కోఆప్షన్ సభ్యురాలు సువర్ణమ్మ, అంగన్‌వాడీ విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు సిద్దగంగమ్మ, ఎంపీటీసీ కృష్ణవేణి, సహారా భాను తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

హిందూపురం టౌన్: హిందూపురం ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో వివిధ చోట్ల ఎక్సైజ్ పోలీసులు దాడులు జరిపి కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. ఆదివారం ఎక్సైజ్‌స్టేషన్‌లో ఆయన వివరాలను వెల్లడించారు. హిందూపురం నుంచి కెంచనపల్లికి వెళ్లే రహదారిలో కిరికెర క్రాస్ వద్ద ఓ వ్యక్తి కర్ణాటక మద్యం కలిగి ఉండడంతో అతన్ని అరెస్ట్ చేశామన్నారు. అతని వద్ద నుంచి 48 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే కొల్లకుంట బ్రిడ్జి వద్ద మద్యం విక్రయిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసి 8 మద్యం బాటిళ్లు, అలాగే చిలమత్తూరు మండలంలో కొడికొండ నుంచి మోరంపల్లికి వెళ్లే రహదారిలో 6 లీటర్ల మద్యం కలిగి ఉన్న మహిళలను అరెస్ట్ చేశామన్నారు.

కల్లు దుకాణాల్లో తనిఖీ

పట్టణ, మండల, పరిగి, లేపాక్షి, చిలమత్తూరు మండల పరిధిలో ఉన్న కల్లు దుకాణాలు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య ఆదివారం తనిఖీ చేశారు.